బంధువులతో మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాశ్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శ్రీనివాస్ (ఫైల్)

హాజీపూర్, జూన్ 19 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట శివారులోని బుగ్గగట్టు హనుమాన్ విగ్రహం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముల్కల్ల గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందినట్లు హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ముల్కల్ల గ్రామానికి చెందిన బొలిశెట్టి శ్రీనివాస్ (39) లక్షెట్టిపేటలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని ముల్కల్లకు బైక్‌పై తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొనడంతో చెట్ల పొదల్లో పడి అక్కడిక్కడే మృతి చెందాడన్నారు. తెల్లవారు జామున గమనించిన ప్రజలు స్థానిక పోలీసులకు సమాచారం అందించారన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదస్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్నేహితులు, బంధువులు ప్రభుత్వ దవాఖానకు తరలిరావడంతో రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు అభిరామ్, శ్రీజ ఉన్నారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతిపై అనుమానాలు..

బుధవారం రాత్రి మృతి చెందిన బొలిశెట్టి శ్రీనివాస్ (39) అనుమానం ఉందని మృతుడి కుటుంబ సభ్యులు స్నేహితులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన చోట చెట్లను తొలగించడంతో ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న ఏసీపీ ప్రకాశ్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి సముదాయించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

హాజీపూర్, జూన్ 19 : మండలంలోని టీకన్నపల్లికి చెందిన చాకపెల్లి సత్తయ్య (45) ఈ నెల 17న హెర్బిసైడ్ అనే రసాయనం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని హాజీపూర్ ఎస్ఐ స్వరూప్‌రాజ్ తెలిపారు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన చికిత్సను అందిస్తున్నారు. చికిత్సను పొందుతూ గురువారం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. అప్పుల బాధతోనే విషం తాగినట్లు మృతుడి తండ్రి పోచయ్య తెలిపాడన్నారు. మృతుడి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు వేదికలో చోరీ

వివరాలు సేకరిస్తున్న సీఐ దేవేందర్ రావు

చెన్నూర్ రూరల్, జూన్ 18: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతు వేదికలో దొంగతనం జరిగినట్లు ఏఈవో సాయికృష్ణ గురువారం చెన్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుదవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రైతు వేదిక తాళాలు పగులగొట్టి అందులో ఉన్న కంప్యూటర్, స్పీకర్లను దొంగలించినట్లు ఏఈవో తెలిపారు. గురువారం ఉదయం చూసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి, చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఈవో తెలిపారు. సీఐ దేవేందర్ రావు రైతువేదికలను పరిశీలించి, వివరాలు సేకరించారు. దుండగులను పట్టుకుంటామని సీఐ తెలిపారు

ఉదయం చోరీ.. మధ్యాహ్నం అరెస్ట్

నిందితుడిని అరెస్ట్ చూపిస్తున్న ఎస్ఐ ప్రవీణ్

కాసిపేట, జూన్ 19 : ఉదయం దొంగతనం జరగగా మధ్యాహ్నం వరకే దొంగను కాసిపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు గురువారం కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ నిందితుడిని అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టేషన్ పెద్దనపల్లి గ్రామానికి చెందిన పుత్తూరి వేణుగోపాల్ గురువారం ఉదయం అతనితో పాటు తన చెల్లితో పాటు బెల్లంపల్లి మార్కెట్‌కు వెళ్లి తిరిగి వచ్చే సరికి గుర్తు తెలియని దొంగలు ఇంట్లో ప్రవేశించి ఇంటి తాళం రాడ్డుతో పగల గొట్టి బీరువాలోని రూ.3000 దొంగిలించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారంతో యూపీకి చెందిన నిందితుడు, ప్రస్తుతం చంద్రవెళ్లికి చెందిన మహమ్మద్ నదీమ్ అన్నారీ సోమగూడెం, బెల్లంపల్లి రహదారి మధ్యలోని మధుర జంక్షన్ వద్ద పట్టుకున్నారు. నగదును సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తక్షణమే స్పందించి దొంగను పట్టుకున్న పోలీసులను స్థానికులు అభినందించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

హాజీపూర్, జూన్ 19 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసిన తర్వాతనే ఎన్నికలను నిర్వహించాలని జాతీయ బిసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్వంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదురుగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు తులా మధుసూదన్, విజయ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సాలేగూడ ఉపాధ్యాయురాలిపై ఫిర్యాదు

కాసిపేట, జూన్ 19 : కాసిపేట మండలంలోని సాలేగూడ గ్రామస్తులు మల్కెపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మయ్యకు వినతిపత్రం అందించారు. సాలేగూడ ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయురాలు(సీఆర్టీ)పై ఫిర్యాదు చేశారు. గతేడాది నుంచి నేటి వరకు మా పాఠశాలలోని పిల్లలకు సరిగ్గా పాఠాలు చెప్పడం లేదన్నారు. పాఠశాల సమయంలో కూడా పిల్లలు బయట ఆడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై గతంలో కూడా ఫిర్యాదు చేశామని, కాని నేటి వరకు ఎలాంటి మార్పు రాలేదన్నారు. పాఠశాలలో పిల్లలకు సరైన ఉపాధ్యాయులు కావాలని, వేరే ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెంద్రం ప్రభాకర్, కుర్సింగ జంగు, నరేశ్, కుడ్మేత చిన్ను, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఎస్టీలకు అన్యాయం

తాండూర్, జూన్ 19 : మండలంలోని కిష్టంపేటలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎస్టీలకు అన్యాయం జరిగిందని బీజేపీ బూత్ అధ్యక్షుడు ఏముర్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో మండల బీజేపీ నాయకులు గురువారం తహసీల్దార్ జ్యోత్స్న కు వినతిపత్రం అందజేశారు. తాండూరు మండల కాంగ్రెస్ నాయకులు డబ్బులు తీసుకుని అనర్హులకే ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. చాలమంది పేదలుండగా ఏడుగురికే ఇళ్లు రావడంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

తాండూర్, జూన్ 19 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఎంఈవో ఎస్ మల్లేశం అన్నారు. మండలంలోని బారెపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలను గురువారం ఎంఈవో మల్లేశం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఉమారాణితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలో సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాసాడి శ్రీరాములు, ఉపాధ్యాయులు సతీశ్‌కుమార్, మురళీధర్‌గౌడ్, సీఈఆర్టీ నాగరాజు, విద్యార్థులు ఉన్నారు.

మత్స్యకారుల మధ్య వివాదం

భీమారం, జూన్ 19 : కొంత కాలంగా భీమారం శివారు ప్రాంతంలో ఉన్న గొల్లవాగు ప్రాజెక్ట్‌లో చేపలు పట్టే విషయంలో మత్స్యకారుల మధ్య వివాదం కొనసాగుతున్నది. గొల్లవాగు ప్రాజెక్ట్‌లో చేపలు పట్టేందుకు కొంత మంది ముదిరాజ్‌లు టెండర్లు వేసి కరీంనగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి రూ. 33 లక్షలకు అంటగట్టారని సుంకరి గోపాల్, దాసరి చంద్రమౌళి, దబ్బెట దర్మయ్య, దబ్బెట సంతోష్, సుంకరి వెంకటేశ్ ఆరోపించారు. కొంత మంది తమ కులంలోనే వారే కమీషన్లు తీసుకుని గుత్తేదారులకు అప్పగించారని చెప్పారు. కొంత కాలంగా కలెక్టర్‌తో పాటు, ఫిషరిష్ ఏడీ అవినాష్‌కు సైతం ఫిర్యాదు చేశామన్నారు. గుత్తేదారులు గురువారం వచ్చి గొల్లవాగులో చేపలు పట్టారు.

గ్రంథాలయ హాలు ప్రారంభం

సీసీసీ నస్పూర్, జూన్ 19: నస్పూర్ పట్టణంలోని తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ హైస్కూల్ నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం హాలును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వామన్‌రావు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సంధ్యారాణి, గ్రంథాలయం ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఆర్టీ మెరిట్ జాబితా విడుదల

నస్పూర్, జూన్ 19 : మంచిర్యాల జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులైన 2 సీఆర్‌టీ (బయోలాజికల్ సైన్స్, ఫిజికల్‌సైన్స్), 1 పీజీసీఆర్‌టీ (నర్సింగ్) కాంట్రాక్టు పోస్టులకు రాత పరీక్ష రాసిన వారి మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న పరీక్ష రాసిన మహిళా అభ్యర్థులను రోస్టర్ మెరిట్ ఆధారంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఎంపిక చేసిన జాబితా వెబ్‌సైట్‌లో ఉందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో డీఈవో కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

స్వయం సహాయక సంఘాలకు కోటి రుణం

మందమర్రి, జూన్ 19: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిది మెప్మా స్వయం సహాయ సంఘాలకు యూనియన్ బ్యాంక్ కల్యాణిఖని బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం రూ.కోటి రుణాలను అందించారు. బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ మహేందర్, మెప్మా టీఎంసీ రఘురాంలు సంఘాల సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు, సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

కాసిపేట, జూన్ 19 : సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు దోహద పడుతాయని దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం కాసిపేట మండలంలోని దేవాపూర్‌లోని హనుమాన్ ఆలయం సమీపంలో ఆరు సీసీ కెమెరాలను ఎస్ఐ ఆంజనేయులు ప్రారంభించారు. సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు.

భీమిని మండలంలో..

భీమిని, జూన్ 19 : నేరాల నియంత్రణకే సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని భీమిని ఎస్ఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చిన్నగుడిపేటలో దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో దొంగతనాలు, నేరాలు చేసేందుకు నిందితులు భయపడుతారన్నారు. ఒక్క సీసీ కెమెరాల వంద మంది పోలీసులతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

నస్పూర్, జూన్ 19 : అర్హులైన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 18 వరకు పొడిగించినట్లు జిల్లా మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ తెలిపారు. తెలంగాణ వికలాంగుల సహాయ సమితి ద్వారా దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ చేస్తారని తెలిపారు. దివ్యాంగులు ఈ నెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీచేసిన ఏసీపీ

రామకృష్ణాపూర్, జూన్ 19: రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏసీపీ వెంట ఎస్ఐ రాజశేఖర్, రెండవ అదనపు ఎస్ఐ లలిత, ఉమెన్ విభాగం ఏఎస్ఐ రజిత, హెడ్ కానిస్టేబుల్ అంకయ్య, సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర

- జీవో 49 రాజ్యాంగ విరుద్ధం
- రైతులపై అటవీ అధికారులు వేధింపులు మానుకోవాలి
- బీఆర్ఎస్ నాయకులు

పెంచికల్ పేట్‌లో మాట్లాడుతున్న బిఆర్ఎస్ మండల కన్వీనర్ బిట్టు శ్రీనివాస్

దహెగాం : మాట్లాడుతున్న యూత్ అధ్యక్షుడు కాసిపాక రాజు

పెంచికల్ పేట్, జూన్19 టైగర్ కన్జర్వేషన్ పేరుతో ఆదివాసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని బీఆర్ఎస్ మండల కన్వీనర్ బిట్టు శ్రీనివాస్ ఆరోపించాడు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 7 పులుల కోసం ఏడు లక్షల మందిపై రాష్ట్ర ప్రభుత్వం పులి పంజా వేస్తున్నదని జీవో 49 రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. అటవీ సంపదకు విరుద్ధం కాదని అడవిని నమ్ముకొని బతుకుతున్న ఆదివాసీలపై పులి పంజా(జీవో నంబర్ 49) ను రద్దు చేయాలని అన్నారు. లేదంటే గ్రామాల వారీగా జిల్లా కేంద్రం వరకు పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తా కోలు నిర్వహించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూములను గుంజుకుంటే సహించేది లేదు

దహెగాం, జూన్ 19 : ప్రభుత్వం ఆదివాసీల భూములను గుంజుకుంటే సహించేది లేదని నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు కాసిపాక రాజు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీవో నం.49 టైగర్ కన్జర్వేటర్ జోన్‌ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్‌తో ఆదివాసీలకు మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ ఆధ్వర్యంలో టైగర్ జోన్ రద్దు కోసం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో దహెగాం మండల ఉపాధ్యక్షుడు దందర మల్లేశ్, యూత్ అధ్యక్షుడు రౌతు శ్రీకాంత్, నాయకులు కంబాల నవీన్, నస్పూరి లక్ష్మి, చప్పిడ సూరి, మానుపల్లి ప్రకాశ్, దర్గం మను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనిమియా నివారణకు చర్యలు

- డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్

కాసిపేట పీహెచ్‌సీలో ర్యాలీ తీస్తున్న అధికారులు

మంచిర్యాల అర్బన్, జూన్ 19: జిల్లాలో సికిల్ సెల్ ఎనిమియా నివారణకు యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకుంటున్నట్లు మంచిర్యాల డీఎంహెచ్‌వో డా.హరీశ్ రాజ్ తెలిపారు. గురువారం మంచిర్యాల జిల్లాలో ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని సాయికుంట లోని ఆశ్రమ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనిమియా పైన జిల్లాలో గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన దండేపల్లి, తాళ్లపేట్, మందమర్రి, కాజిపేట్, గ్రామాల్లో పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు 40 ఏళ్ల లోపు ఉన్న వారంతా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మంచిర్యాల జనార్దన్, జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, వైద్యులు ప్రసాద్, సుధాకర్ నాయక్, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణులు అనిత, కృపాబాయి, వైద్యాధికారులు శివప్రతాప్, అమన్, స్నేహిత, సబ్ యూనిట్ అధికారి నామదేవ్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీపీవో ప్రశాంతి, గిరిజన సంఘాల నాయకులు రాజన్న, డెమో బుక్క వెంకటేశ్వర్, ఆశ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కాసిపేట, జూన్ 19 : కాసిపేటలోని పీహెచ్ సీలో గురువారం ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సమావేశం నిర్వహించారు. ముందుగా సికిల్ సెల్ రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. అవగాహన ర్యాలీ తీశారు. సికిల్ సెల్ ఉన్న వారికి యూనిక్ డిజబులిటీ ఐడెంటిఫికేషన్ కార్డ్ (యూడీఐడీ) చేయించారు.

నెన్నెల, జూన్ 19 : నెన్నెల మండలంలోని జంగల్‌పేట గ్రామంలోని గిరిజనులకు సికిల్ సెల్స్ అనిమియా పై అవగాహన కల్పించారు. సికిల్ సెల్ అనిమియా నిర్మూలనకు కట్టుబడి ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ లక్ష్మణ్, ఎంపీడీవో దేవేందర్‌లు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

2047 వరకు వ్యాధిని తొలగించడమే లక్ష్యం

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 19 : తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులను 2047 సంవత్సరం నాటికి పూర్తిగా నివారించేందుకు కృషి చేయాలని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఉప కార్యదర్శి గణేశ్ నాగరాజన్ అన్నారు. గురువారం ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ –ఉట్నూరు ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, డీఎంహెచ్‌వో సీతారాం, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, తల సేమియా, సికిల్ సెల్ నోడల్ అధికారి డా. వినోద్‌తో కలిసి ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 30వ తేదీ వరకు గిరిజన గ్రామాలలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పీ వో, అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పథకాల అమలు, తీసుకుంటున్న చర్యలు, గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవలను వివరించారు.

రుణాలను సక్రమంగా చెల్లించాలి

సీసీసీ నస్పూర్, జూన్ 19: మహిళా సంఘాలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు క్రమ పద్ధతిలో చెల్లించాలని, ఇది వరకు తీసుకున్న రుణాలను మహిళా సంఘాలు క్రమం తప్పకుండా చెల్లిస్తూ రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉన్నారని రిజర్వ్ బ్యాంక్ ఏజీఎం, ఎఫ్ఐడీడీ శ్రీరాములు వెల్లడించారు. గురువారం నస్పూర్‌లో ఆర్థిక అక్షరాస్యతపై సమావేశాన్ని నిర్వహించారు. మహిళా సంఘాలకు లభించే రుణాలు, ఇన్సూరెన్స్, అటల్ పెన్షన్, డిజిటల్ లావాదేవీల ద్వారా జరిగే మోసాల గురించి మహిళా సంఘాలు, బ్యాంకుల ఖాతాదారులకు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా బ్యాంకుల సమన్వయ అధికారి తిరుపతి, టీజీబీ సీతారాంపల్లి శాఖ మేనేజర్ నరసింహస్వామి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ సాగర్, ఆర్థిక అక్షరాస్యత ప్రతినిధులు స్వరూప, రాజశేఖర్, మెప్మా టీఎంసీ నాగరాజు, మహిళా సంఘాల ప్రతినిధులు శ్రీదేవి, సీతారాంపల్లి గ్రామీణ బ్యాంకు, సీసీసీ యూనియన్ బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తాం

బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 19:జిల్లాలోని పోలీస్ కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లపుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన కానిస్టేబుల్ మడవి ఆనంద్ కుమార్ కుటుంబ సభ్యులకు రూ.8 లక్షల భద్రతా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు విజయ శంకర్ రెడ్డి, ఆర్.ఐ అడ్మిన్ పెద్దన్న, జిల్లా పోలీసు కార్యాలయ ఎవో శ్రీనివాస్, ఎ సూపరిండెంట్ ఖలీల్ పాల్గొన్నారు.

ఎస్టీపీపీకి మరో అవార్డు

ఎస్టీపీపీ తరపున మహారాష్ట్రలో అవార్డు అందుకుంటున్న జీఎం జానకీరాం

జైపూర్, జూన్ 19: జైపూర్ సింగరేణి విద్యుత్‌కేంద్రాన్ని మరో అవార్డు వరించింది. పర్యావరణ చర్యలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు గాను గురువారం మహరాష్ట్ర లోనావాల లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో గ్రీన్ ఎన్విరో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్టీపీపీకి 'గోల్డ్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డు ' లభించింది. ఈ అవార్డుతో కలిపి ఎస్టీపీపీకి ఇప్పటివరకు 52 అవార్డులు సాదించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ అవార్డును ఎస్టీపీపీ తరుపున జానకిరాం జీఎం (ఈఅండ్ఎం) సోలార్ అందుకున్నారు. ఈ అవార్డు రావడం పట్ల సింగరేణి సీఅండ్ఎండీ బలరాం హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మునుముందూ మరిన్ని అవార్డులు సాధించాలని తెలిపారు.

దినచర్యలో యోగా భాగం కావాలి

- బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్

గోలేటి జీఎం కార్యాలయంలో యోగా చేస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి, అధికారులు

శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో..

రెబ్బెన, జూన్ 19: యోగాను ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ, ఏరియా స్టోర్స్, ఏరియా వర్క్‌షాప్, గోలేటి సీహెచ్‌పీ, బెల్లంపల్లి ఏరియా దవాఖానల్లో గురువారం యోగా శిబిరాలు నిర్వహించి యోగా శిక్షకులు రాజలింగు, రాజ్యలక్ష్మి, అలేఖ్య ఆధ్వర్యంలో యోగా అసనాలు వేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం రాజమల్లు, అధికారుల సంఘం ప్రతినిధి ఉజ్వల్‌కుమార్‌బెహరా, డీజీఎం(సివిల్) ఎస్‌కె మదీనబాషా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, పర్చేస్ అధికారి రవికుమార్, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ పలువురు ఉన్నారు.

శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో

సీసీసీ నస్పూర్, జూన్ 19: శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. జీఎం ఆఫీస్‌లోని సమావేశ మందిరంలో అధికారులు, ఉద్యోగులు యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అనిల్ కుమార్, స్ట్రాటా కంట్రోల్ అధికారి శ్రీధర్, అమర్నాథ్‌రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు, యోగా గురువులు సాంబయ్య, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మందమర్రి, జూన్ 19: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో యోగా సంబురాలు నిర్వహిస్తున్నట్లు గురువారం యోగా మాస్టర్ ముల్కల్ల శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి ఏరియా జీఎం జీ.దేవేందర్, తహసీల్దార్ సతీశ్ కుమార్, సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ హాజరవుతారని తెలిపారు.

కాగజ్‌నగర్, జూన్ 19: కాగజ్‌నగ